క్లుప్తంగా

28న డిగ్రీ సెమిస్టర్ మూల్యాంకనం

చీరాల అర్బన్: ఆంధ్రకేసరి యూనివర్శిటీ, ఒంగోలు అనుబంధ కళాశాలల డిగ్రీ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ మూల్యాంకనం ఈనెల 28న స్థానిక వైపీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో జరుగుతుందని స్పాట్ వాల్యూయేషన్ క్యాంప్ ఆఫీసర్ ఎస్.మురళి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లాంగ్వేజ్ పేపర్స్, బీఎస్సీ, బీఏ ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, బీకాం కామర్స్‌కు సంబంధించిన పేపర్లు వచ్చాయన్నారు. బాపట్ల జిల్లాలోని అన్ని ప్రైవేటు కళాశాలల అధ్యాపకులు తమ యూనివర్శిటీ స్పాట్ వాల్యూయేషన్ అపాయింట్‌మెంట్ ఐడీ కార్డు, పర్సనల్ ప్రొఫైల్, కళాశాల రిలీవింగ్ తీసుకొని రావాలన్నారు. యూనివర్శిటీకి సంబంధించిన అపాయింట్‌మెంట్ ఐడీ కార్డులు తమ కళాశాలలో ఉన్నాయని, కళాశాల ప్రిన్సిపాల్‌కు లెటర్ ద్వారా వారి ఐడీ కార్డులు పొందాలన్నారు.

వృద్ధులకు అన్నదానం

అద్దంకి: పాటిబండ్ల వెంకటేశ్వర్లు వర్ధంతి సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్‌శింగరకొండ ఆధ్వర్యంలో శనివారం శింగరకొండలోని శ్రీరామ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని పాటిబండ్ల రంగరావు సౌజన్యంతో నిర్వహించారు.కార్యక్రమంలో ఆశ్రమ చైర్మన్ రావూరి రంగయ్య రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వైద్యం



కాలనీలో రోగిని పరీక్షించి మాట్లాడుతున్న వైద్యాధికారి

బల్లికురవ: శివారు గ్రామాల్లోనూ ఇంటింటి వైద్యం ప్రభుత్వం షెడ్యూల్ ప్రకారం 104 వాహనం ద్వారా వైద్యం అందిస్తున్నట్లు గుంటుపల్లి పీహెచ్‌సీ డాక్టర్లు పి. భారతి, మమత అన్నారు. శనివారం ఎస్ఎల్ గుడిపాడు పంచాయతీలోని సుజాతానగర్ కాలనీ, ముక్తేశ్వరం పంచాయతీలోని సూరేపల్లి గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. షుగర్, బీపీ, రక్తపరీక్షలతోపాటు, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సాయంత్రం శిబిరానికి రాలేని వృద్ధులు, చిన్నారుల ఇంటికి వెళ్లి వైద్యం అందించారు. అనారోగ్యానికి గురైతే పీహెచ్‌సీకి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి డబ్బు ఖర్చు చేసుకోవద్దని ఆదేశించారు.

చికిత్స పొందుతూ క్షతగాత్రుడు మృతి

చీరాల అర్బన్: బైక్, ఆటో ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటనలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. పి.పవన్, చారి అనే ఇద్దరు యువకులు బైక్‌పై శుక్రవారం రాత్రి ఆర్వోబీపై వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. ఈ సంఘటనలో ఇద్దరినీ గుంటూరు తరలించారు. వీరిలో ఈపూరుపాలేనికి చెందిన పి.పవన్‌కుమార్ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. పవన్‌కుమార్ ట్రిపుల్ ఐటీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఈమేరకు వన్ టౌన్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

మీ నేల బంగారం కానూ!

- పచ్చిరొట్ట సాగుకు తరుణం ఇదే!
- రాయితీపై విత్తనాలు సిద్ధం



పచ్చి రొట్టె విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ



జనుము పైరు

వేటపాలెం: రైతుకు పంటంటే ప్రాణం. ఆరుగాలం శ్రమించి కన్న బిడ్డలా చేలను కాపాడుకుంటాడు. అయితే రసాయనిక ఎరువుల వల్ల దిగుబడి వస్తుందనుకున్నా అవి నేలకు చేసే నష్టం అంతా ఇంతాకాదు. అందుకే జీవరసాయన ఎరువులే నేల తల్లికి బలాన్ని ఇస్తాయి. వీటితో పండించిన పంటల వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. ప్రస్తుతం ఈ తరహా పంటలకు డిమాండ్ ఉండటం శుభపరిణామం.

80 శాతం మంది రైతులు..

ప్రస్తుతం నియోజకవర్గ వ్యాప్తంగా 80 శాతం మంది రైతులు రసాయన ఎరువుల పైనే ఆధార పడుతున్నారు. వీటితో దిగుబడి ఆశాజనకంగా ఉంటున్నా భూమి సారవంతం కోల్పోతుండటంతో ఆందోళన నెలకొంది. పైగా ఈ రసాయనాల వల్ల పంటలు పురుగులు, తెగుళ్ల బారిన పడతాయి. దీంతో రైతులకు సాగు ఖర్చు పెరగడం అలా ఉంచితే.. గాలి, నీరు, భూమి, పంట ఉత్పత్తులన్నీ విష పూరితంగా మారుతున్నాయి. ఇది రైతులకే కాకుండా వ్యవసాయ శాస్త్ర వేత్తలకు కూడా సవాల్‌గా మారింది. అందుకే ఈ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం రసాయన ఎరువులు తగ్గించి పంటలకు అవసరమైన పోషకాలు అందించే పచ్చి రొట్ట ఎరువులను సిఫారసు చేస్తోంది. అంటే జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి విత్తనాలతో నేలకు సారం పెరుగుంది. ఈ క్రమంలో పచ్చిరొట్ట ఎరువులను సర్కారు 50 శాతం రాయితీపై అందిస్తూ అన్నదాతలకు అండగా నిలుస్తోంది.

ఆర్‌బీకేల్లో అందుబాటులో..

మండల పరిధిలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పచ్చి రొట్ట విత్తనాల నిల్వలు అందుబాటులో ఉంచారు. ఇక్కడ నుంచే రైతులకు పంపిణీ చేస్తారు. ఇవి తీసుకోవాలంటే రైతులు తమ ఆధార్ కార్డు తీసుకొని ఆర్‌బీకేల వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఎకరాకి 10 కిలోల చొప్పున పొందేందుకు అర్హత ఉంటుంది.

పోషకాలు పుష్కలం

వరిసాగు చేసే భూముల్లో జీలుగ, జనుము విత్తనాలు తొలకరి వర్షం అనంతరం వేయాల్సి ఉంటుంది. నారుపోసి పొలం దున్నే సమయానికి అంటే 50–60 రోజుల్లో పంట పూతకు వస్తుంది. ఆ సమయంలో వీల్స్ ట్రాక్టర్ ద్వారా దున్ని నాట్లు వేయడం రివాజు. దీని వల్ల వరికి కావాల్సిన ముఖ్య పోషకాలైన కాల్షియం, మెగ్నీషియం, సల్ఫర్, సూక్ష్మ పోషకాలు, జింక్, బోరాన్, ఇనుము, మాంగనీస్ వంటివి పుష్కలంగా అందుతాయి. పచ్చిరొట్ట వల్ల భూమిలో కర్బన శాతం పెరుగుతుంది. అంటే కొద్ది మొత్తంలో రసాయన ఎరువుల వేసినా పంటలకు ఉపయుక్తంగా ఉంటుంది. ఒక వేళ నీటి ఎద్దడి పరిస్థితి తలెత్తినా దానివల్ల పెద్దగా సమస్య తలెత్తదు. అలాగే పంటకు ఉపయోగపడే సూక్ష్మజీవుల సంఖ్య పెరగడమే కాకుండా పురుగులు, తెగుళ్ల బెడద ఉండదు.

రైతులు ఉపయోగించుకోవాలి



రైతులు పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి. దీనివల్ల నేల సారవంతంగా మారుతుంది. ప్రస్తుతం ఆర్‌బీకేల్లో జీలుగ, జనుము, పిల్లిపెసర అందుబాటులో ఉన్నాయి.

– ఐ. కాశీవిశ్వనాథ్, మండల వ్యవసాయ శాఖ అధికారి, వేటపాలెం

దివ్యాంగ చిన్నారులను చదివించాలి



దివ్యాంగుడు రాహుల్‌కు నగదు అందిస్తున్న అధికారులు

యద్దనపూడి: దివ్యాంగ చిన్నారులను తల్లిదండ్రులు తప్పనిసరిగా చదివించాలని బాపట్ల జిల్లా ఐఈ కో ఆర్డినేటర్ ఎం. జ్యోత్స్న అన్నారు. మండలంలోని యద్దనపూడి, జాగర్లమూడి గ్రామాల్లో శనివారం ఆకస్మికంగా పర్యటించి ప్రత్యేక అవసరాలు గల చిన్నారులపై నిర్వహిస్తున్న సర్వేను ఆమె తనిఖీ చేశారు. యద్దనపూడి మండలంలో మే 1 నుంచి జూన్ 9 వరకు 0–18 ఏళ్ల వయసున్న వారికి సీడబ్ల్యూఎస్ఎన్ (ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు) సర్వే నిర్వహిస్తున్నారు. యద్దనపూడిలో జరుగుతున్న సర్వేలో ఆమె పాల్గొని తల్లిదండ్రులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. దివ్యాంగులను చక్కగా చదివించాలన్నారు. జాగర్లమూడి గ్రామంలో రామచంద్రపు రాహుల్ అనే దివ్యాంగ బాలుడికి జర్మన్ టెక్నాలజీతో తయారు చేసిన కృత్రిమ చేతిని అమర్చారు. రూ. 2 వేల నగదు అందించారు. ఐఈఆర్‌టీ (సహిత విద్యాబోధకులు) జి. చిన్నకోటేశ్వరరావు, కె. సురేఖ పాల్గొన్నారు.

వేసవి శిబిరాలతో విజ్ఞానం



విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు(అద్దంకి)

అద్దంకి: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలతో విజ్ఞానం కలుగుతుందని గ్రంథపాలకుడు సుగుణరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాల్లో ఉచితంగా చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అదనపు అర్హతను వేసవిలో పొందవచ్చని చెప్పారు.

సంతమాగులూరులో..

స్థానిక గ్రంథాలయంలో శనివారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించారు. వివిధ రకాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రంథపాలకుడు విజయ భాస్కరరెడ్డి నిర్వహించారు.

భవిత కేంద్రం సద్వినియోగం చేసుకోండి



ప్రత్యేక అవసరాల పిల్లల సర్వేను పరిశీలిస్తున్న జిల్లా సమన్వయకర్త జ్యోత్స్న



భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులతో జిల్లా కో ఆర్డినేటర్

చీరాల అర్బన్: ప్రత్యేక అవసరాల కలిగిన పిల్లలకు బాసటగా భవిత కేంద్రాలు ఉన్నాయని జిల్లా సమన్వయకర్త జ్యోత్స్న అన్నారు. ప్రత్యేక అవసరాల కలిగిన పిల్లల సర్వే కార్యక్రమాన్ని శనివారం చీరాల పరిశీలించారు. 18 సంవత్సరాల్లోపు ప్రత్యేక అవసరాల పిల్లల సర్వే ప్రస్తుతం జరుగుతుందన్నారు. జూన్ 10వ తేదీ వరకు సర్వే చేస్తామని చెప్పారు. భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రత్యేక సదుపాయాలు ఉన్నాయన్నారు. స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, బిహేవియర్ మోడిఫికేషన్ విద్యాబోధనలు భవిత కేంద్రంలో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రత్యేకంగా శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించి స్పెషల్ విద్య అందించేలా తల్లిదండ్రులు సహకరించాలన్నారు. ఆమె వెంట ఐఈఆర్టీలు డి.రాజశేఖర్‌బాబు, వి.నరసింహం ఉన్నారు.

దివ్యాంగుల కోసం ప్రభుత్వ పథకాలు

చినగంజాం: దివ్యాంగుల కోసం ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బాపట్ల జిల్లా ఐఈ కో ఆర్డినేటర్ ఎం జ్యోత్స్న అన్నారు. శనివారం మండలంలో ప్రత్యేక అవసరాల గల పిల్లల సర్వేను తనిఖీ చేశారు. మండల కేంద్రమైన చినగంజాంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని ఆమె సందర్శించి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలను భవిత సెంటర్‌కు పంపించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం నుంచి మంచి ప్రోత్సాహకం అందజేస్తుందని తెలిపారు. ఐఈఆర్టీలు టి. బాలకృష్ణ, డి. నాగార్జున పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల గుర్తింపు



పుట్టాయిపాలెంలో ప్రత్యేక అవసరాల పిల్లల సర్వేలో పాల్గొన్న కోఆర్డినేటర్, ఐఈఆర్పీలు

కారంచేడు: సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ద్వారా చిన్నారులను గుర్తింపును పటిష్టంగా నిర్వహించాలని బాపట్ల జిల్లా సమగ్ర శిక్ష సహిత కోఆర్డినేటర్ జ్యోత్స్న అన్నారు. అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రమైన కారంచేడు, పుట్టాయిపాలెం ప్రాంతాల్లో పర్యటించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను గుర్తించడంలో క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి జూన్ 9 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఐఈఆర్టీలు గృహాలను పరిశీలించాలని ఆదేశించారు. సర్వే సమయంలో ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయాల సిబ్బంది, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. ఇప్పటికే మండలంలో 18 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను గుర్తించామని తెలిపారు. ఐఈఆర్‌పీలు వసంతబాబు, విజయ్‌కుమార్, కోటి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్ సిబ్బంది నిబంధనలు పాటించాలి



కౌంటింగ్ విధానంపై శిక్షణ ఇస్తున్న ఆర్‌పీ రవీందర్

పర్చూరు (చినగంజాం): ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన నియమ నిబంధనలను కౌంటింగ్ సిబ్బంది పాటించాలని పర్చూరు రిటర్నింగ్ అధికారి జి. రవీందర్ సూచించారు. శనివారం పర్చూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆయన జూన్ 4 న జరగబోయే కౌంటింగ్‌లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ సిబ్బంది ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించాలని, ఎటువంటి లోపాలు తలెత్తకుండా నడుచుకోవాలని సూచించారు.

ఇన్వర్టర్, బ్యాటరీ వితరణ



రోటరీ క్లబ్‌కి ఇన్వర్టర్, బ్యాటరీ అందిస్తున్న క్లబ్ సభ్యుల

వేటపాలెం: స్థానిక సారస్వత నికేతనం గ్రంథాలయానికి రోటరీ క్లబ్ ఆఫ్ వేటపాలెం వారిచే ఇన్వర్టర్, బ్యాటరీ శనివారం అందించారు. ఈ సందర్భంగా రోటరీ అసిస్టెంట్ గవరన్నర్ ఎం. సుధీర్ కుమార్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేయడం సంతోషదాయకమన్నారు. గ్రంథాలయంలో కరెంటు పోయినప్పుడు పాఠకులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు రూ. 25 వేల విలువైన ఇన్వర్టర్, బ్యాటర్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. రోటరీ గవర్నర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డి వేటపాలెం రోటరీ క్లబ్‌కి గతంలో వచ్చిన సందర్భంగా ఆయన గ్రంథాలయాన్ని సందర్శించారు. అప్పటిలో గ్రంథాలయానికి అవసరమైన ఇన్వర్టర్ స్పాన్సర్ చేశారు. ఆయన ఇచ్చిన మాట ప్రకారం ఇప్పుడు ఇన్వర్టర్ ఇస్తామని తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు బట్ట మోహన్‌రావు, రోటరీ వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్లపూడి సీతారాం, రోటరీ కార్యదర్శి ఏపీ సురేష్‌బాబు, సీనియర్ సభ్యులు ప్రత్తి వెంకట సుబ్బారావు, కొత్త శ్రీనివాసరావు, కార్యదర్శి పల్లపోతు వెంకటేశ్వర్లు, లైబ్రేరియన్ శ్రీవల్లి, బీరం సుందరావు, యారాసు గణపతి పాల్గొన్నారు.

పచ్చి రొట్ట విత్తనాల పంపిణీ

మార్టూరు: వ్యవసాయంలో దుక్కుల సీజను ప్రారంభమైనందున రైతులకు 50 శాతం రాయితీ ధరలతో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి వి. కిరణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని రైతు భరోసా కేంద్రంలో ఆయన రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తూ వారితో మాట్లాడారు. జనుము, జీలుగ విత్తనాలు 10 కిలోలు 44 రూపాయల చొప్పున పిల్లి పెసర విత్తనాలు 8 కిలోలు 67 రూపాయల చొప్పున 50 శాతం రాయితీతో పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఆవసరమైన రైతులు ఆర్‌బీకేల్లో సంప్రదించాలని కిరణ్ కుమార్ తెలిపారు.

ఘనంగా భావన్నారాయణుడి మల్లె పూల సేవ



భావన్నారాయణునికి మల్లెపూల సేవ కార్యక్రమాన్ని నిర్వహించిన భక్తులు

చినగంజాం: స్థానిక శ్రీ భూ సమేత భావన్నారాయణ స్వామి ఆలయంలో భావన్నారాయణ స్వామికి మల్లెపూల సేవ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో ప్రతి ఏడాది వైశాఖ మాసం సందర్భంగా స్వామికి మల్లె పూల సేవ, విశేష సేవా కార్యక్రమాలు, విశేషాలంకరణ కార్యక్రమం నిర్వహించడం సంప్రదాయం. స్వామికి వైశాఖ మాసం ప్రీతికరమైన మాసం సందర్భంగా మల్లెపూల సేవ కార్యక్రమం నిర్వహించారు. ఉభయ దాతలుగా వలివేట లక్ష్మీనారాయణ, మహాలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుమారులు వలివేటి శివనారాయణ, వెంకట రామానుజంలు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

షుగర్ అదుపులో ఉంటే సంపూర్ణ ఆరోగ్యం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ నవీన్‌కుమార్

చీరాల టౌన్: షుగర్ వ్యాధితో బాధ పడేవారు వైద్యుల సూచనలు, సలహాలు పాటించడంతో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని.. సరిగా మందులు తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ నవీన్‌కుమార్ సూచించారు. శనివారం పట్టణంలోని శ్రీకామాక్షి కేర్ హాస్పిటల్‌లో రోటరీక్లబ్ ఆఫ్ క్షీరపురి సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరంలో 69 మంది సేవలు అందించారు. డాక్టర్ నవీన్‌కుమార్, ఆప్తాలమిక్ ఆఫీసర్ టి. కుమార్.. వైద్య పరీక్షలు చేసి రోటరీక్లబ్ ఆఫ్ క్షీరపురి సహకారంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. షుగర్ వ్యాధితో బాధపడేవారు ప్రతి ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలన్నారు. నన్నపనేని రామకృష్ణ, బి.నాగ మల్లేశ్వరరావు, అడ్డగడ మల్లిఖార్జునరావు, రావి రమణారావు, ఎం.వెంకటేశ్వర్లు, హాస్పిటల్ ఎండీ తాడివలస దేవరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

చెడు వ్యసనాలతో భవిష్యత్‌కు కీడు



మాట్లాడుతున్న వినియోగదారుల ఫోరం ప్రతినిధి దాసరి ఇమ్మానియేల్



మాట్లాడుతున్న రమేష్‌బాబు

చీరాల రూరల్: చిన్న విషయాలకు బాల, బాలికలు ఇంట్లో అలిగి పారిపోవడం వలన అక్రమార్కుల చేతుల్లోపడి తమ బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ తప్పిపోయిన బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక శాఖ గ్రంథాలయంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. చీరాల న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రమేష్‌బాబు మాట్లాడారు. బాల, బాలికలంతా తల్లి దండ్రులను అనుసరించాలని.. చిన్నచిన్న విషయాలకు అలిగి పారిపోతే చెడు వ్యసనాలకు, మత్తుపానీయాలకు, దొంగతనాలకు అలవాటుపడి మంచి భవిష్యత్తును కోల్పోతారన్నారు. కొన్ని సార్లు ప్రాణాపాయం తప్పదని తెలిపారు. మానవ అక్రమ రవాణావంటి విషయాలపట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఉచిత నిర్బంధ హక్కు చట్టం, బాల కార్మికుల నిరోధక చట్టం, ఫోక్సో యాక్టు, ఇమ్మోరల్ ట్రాఫికింగ్ యాక్టు వంటి చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయవాది జేకీ ఈశ్వరి రెడ్డి, లోక్ అదాలత్ ఇన్‌చార్జ్ వి. వీరరాఘవులు, గ్రంథాలయ అధికారి డి. ధనమ్మ, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ పవని భాను చంద్రమూర్తి, పీఎల్‌వీలు ఎస్‌డీ మతిన్, డి. ఇమ్మానియేలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లాసంగా తప్పిపోయిన పిల్లల దినోత్సవం

చీరాల అర్బన్: అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మే 25న ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారని చీరాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు అన్నారు. శనివారం స్థానిక శాఖ గ్రంథాలయంలో అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తప్పిపోయిన పిల్లలు, అపహరణకు గురైన పిల్లల గురించి ప్రజల్లో అవగాహన పెంచడం కోసం ప్రతి ఏడాది మే 25న దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారన్నారు. 2001 నుంచి ఆరు ఖండాల్లోని 20కి పైగా దేశాల్లో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. పిల్లల అపహరణ సమస్యను గుర్తించడానికి, పిల్లల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై తల్లిదండ్రులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చేలా న్యాయ సేవా సంస్థ పనిచేస్తుందన్నారు. న్యాయవాది ఈశ్వరి రెడ్డి, వినియోగదారుల ఫోరం ప్రతినిధి దాసరి ఇమ్మానియేల్, పారా లీగల్ వలంటీర్ సయ్యద్ మతిన్, జిల్లా సైన్స్ కో–ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, గ్రంథపాలకురాలు డి.ధనమ్మ పాల్గొన్నారు.

వృద్ధురాలికి వీల్‌చైర్ అందజేత



వీల్‌చైర్ అందజేస్తున్న దాత పద్మభాస్కర్ చైర్మన్

చీరాల రూరల్: నడవలేని స్థితిలో ఉన్న నిరుపేద వృద్ధురాలికి వీల్‌చైర్ అందజేశారు దాత ఘంటా అనిల్‌కుమార్, పద్మభాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఘంటా అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం జయంతిపేటకు చెందిన తలమాల మేరి సుశీల అనే వృద్ధురాలికి ఆమె ఇంటివద్దనే ఆమె కుమారుడు పున్నయ్యకు సుమారు రూ. 7,000 విలువ కలిగిన వీల్‌చైర్ అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. వృద్ధురాలు మేరీ సుశీల నడవలేక ఇంటివద్దనే ఉంటున్నదని, వీల్‌చైర్ కొనుగోలు చేయలేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఆమె కుమారుడు పున్నయ్య తన దృష్టికి తీసుకురావడంతో ఈ చిరుసాయం అందించినట్లు చెప్పారు. గత శనివారం పేరాల శృంగారపేటకు చెందిన ఏడవ తరగతి చదివే పేర్లి లియోరాకి రూ. 6,500 విలువ కలిగిన సైకిల్ అందజేసిన విషయం విదితమే. తమ పెద్దలు పద్మభాస్కర్ పేరుతో ఫౌండేషన్ ఏర్పాటు చేసి నిరుపేదలకు, చదువుకుంటూ ఫీజులు కట్టలేని విద్యార్థులకు కుల, మత బేధాలు అనే తారతమ్యాలు లేకుండా తన సహాయ సహకారాలు అందిస్తున్నట్లు చెప్పారు. పూర్వ విద్యార్థులు గొట్టిపాటి బాబురావు, వనమా జయకుమార్, ఎడ్ల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాలపై పోలీసుల దృష్టి



సోదాలు నిర్వహిస్తున్న టూటౌన్ సీఐ సోమశేఖర్



ఇందిరా కాలనీలో సోదా చేస్తున్న పోలీసులు

చీరాల: చీరాల టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామని టూటౌన్ సీఐ సోమశేఖర్ అన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ ఉత్తర్వుల మేరకు శనివారం చీరాల టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జాన్‌పేట, జయంతిపేటలో కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటినీ సోదా చేశారు. ఇంటి ఆవరణలో పెట్రోలు, డీజిల్, కర్రలు, రాళ్ళు ఉన్నాయా అని చూశారు. రౌడీ షీటర్లుకు వారి ఇంటి వద్దనే కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ ముందురోజు, కౌంటింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి వివరాలను పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పోలీసుల ఉత్తర్వులు ఉల్లఘిస్తే సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేయడంతో పాటు రౌడీషీట్స్ తెరుస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

పర్చూరులో...

పర్చూరు (చినగంజాం): పర్చూరు ఇందిరా కాలనీలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. శనివారం స్థానిక సీఐ సీతారామయ్య తన సిబ్బందితో తనిఖీ చేశారు. గొడవలు, అలజడుల్లో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

చల్లబడిన వాతావరణం

బల్లికురవ: రోహిణి కార్తె ప్రవేశంతో ఎండలు వడగాల్పుల ఉధృతి అధికం అవుతుందని భావించిన ప్రజలకు వాతావరణం చల్లబడటంతో ఉపశమనం లభించింది. శనివారం తుఫాన్ హెచ్చరికలతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మూడు రోజులుగా ఎండలు వడగాల్పులతో బెంబేలెత్తిన ప్రజలకు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వాతావరణం చల్లబడటంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా యాభై శాతంరాయితీపై జనులు, జీలుగు, పిల్లిపెసర విత్తనాలు అందజేయడంతో మాగాణి భూముల్లో చల్లేందుకు సిద్ధమయ్యారు.